సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 24 । జనవరి । 2024



క్రమశిక్షణతో పనిచేస్తే గుర్తింపు
క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు.
10లో



ఉత్తమ ఉద్యోగుల ఎంపిక
గణతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణిలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ఉద్యోగులు, కార్మికులను ఎంపిక చేశారు.
12లో

గరిష్టం / కనిష్టం
33° / 17°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం తక్కువగా, రాత్రికి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామాలయంలో ఆడిట్ ప్రారంభం

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మంగళవారం నుంచి అధికారులు ఆడిట్ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన ఈ ఆడిట్ గత నాలుగేళ్లుగా జరగలేదు. అయితే ఆలయానికి సంబంధించిన లెక్కల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు లెక్కలు తేల్చే పనిలో పడ్డారు. ఈ ఆడిట్ ఐదు రోజుల పాటు జరగనున్నట్లు సమాచారం.

సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులమంతా సమన్వయంతో వ్యవహరిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు సామాజిక న్యాయ సాధనకు 15వ ఆర్థికసంఘం నిధులు దోహదపడతాయని చెప్పారు. నిర్దేశించిన నిధుల్లో 30 శాతం శానిటేషన్ పనులకు, 30 శాతం తాగునీటి అవసరాలకు వినియోగించాలని, మిగిలిన నిధుల్లో 30 శాతం సివిల్ పనులకు, 10 శాతం కార్యాలయ నిర్వహణకు ఖర్చు చేయాలని అన్నారు. ప్రజలందరికీ ఉపయోగపడేలా అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, పీఆర్ ఈఈలు శ్రీనివాసరావు, మంగ్యానాయక్ పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను బుధవారం ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈఓ ఎం.విద్యాలత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని జెడ్పీటీసీలు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సాగులో సఫలం!



తైవాన్ జామ తోటలో గంగరాజు



ఆదర్శంగా నిలిచిన గిరిజన రైతు

- సాగుపై నాడు విరక్తి.. నేడు ఆసక్తి
- సంప్రదాయ పంటలు వదిలేసి పండ్ల తోటలతో ఆర్థికాభివృద్ధి
- ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

దుమ్ముగూడెం: ఆ రైతు ఉన్నత విద్యనభ్యసించలేదు. అక్షరదీపం బడిలో ఓనమాలు మాత్రమే నేర్చుకున్నాడు. కష్టపడి పనిచేయడం అతడి నైజం. పదెకరాల భూమి ఉన్న ఆ రైతుకు వ్యవసాయం అంటే మక్కువ. కానీ ప్రకృతి సహకరించక ఎప్పుడూ నష్టాలే వచ్చేవి. పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు అధికమయ్యేవి. అంత పెట్టినా దిగుబడి అంతంతగానే ఉండేది. ఆ పంటను కోసేందుకు కూడా కూలీలు దొరకక అనేక ఇబ్బందులు పడేవారు. ఒకానొక సమయంలో ఇక సాగుకు గుడ్‌బై చెబుదామనుకున్నాడు. అప్పుడు అతడికి వచ్చిన ఆలోచన వారి జీవితాన్ని మలుపుతిప్పింది. కూలీల అవసరం లేకుండా, సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలు సాగు చేయాలనుకున్నాడు. ఆ నిర్ణయాన్ని వెంటనే అమలు చేసి నేడు అందరికీ ఆదర్శంగా నిలిచాడు మండలంలోని పెద్దార్లగూడేనికి చెందిన గిరిజన రైతు పెనుబల్లి గంగరాజు. భార్య లక్ష్మి సహకారంతో పండ్ల తోటల సాగులో విజయం సాధించాడు. అతడి పట్టుదలను గుర్తించిన ప్రభుత్వం.. ఘనంగా సత్కరించేందుకు ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఆహ్వానించింది.

పదెకరాల్లో పండ్ల తోటలు..

పదేళ్లుగా పండ్ల తోటలు సాగు చేస్తున్న ఆ గిరిజన దంపతులు ఇప్పుడు ఆర్థికంగా లాభం పొందుతున్నారు. మొదట తైవాన్ జామ, సపోట, మామిడి, నిమ్మకాయలు పండించగా వాటికీ చీడపీడలు ఆశించాయి. దీంతో వాటిని పూర్తిగా తీసేసి డ్రాగన్ ఫ్రూట్, యాపిల్‌బేర్, పామాయిల్ మాత్రమే పండిస్తున్నారు. తాము సొంతంగా తయారుచేసుకున్న డ్రిప్ సిస్టం ద్వారా మొక్కలను నీరు పెడుతున్నారు. పదేళ్ల కాలంలో మొత్తం రూ.5లక్షలు పెట్టుబడి పెట్టగా.. ఇప్పుడు రెట్టింపు ఆదాయం వస్తోందని చెబుతున్నారు. అంతేకాక ఇక ప్రతి సంవత్సరం పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదని, ఏడాదికి రూ.2 లక్షల ఆదాయం వస్తోందని అంటున్నారు.

వరి, పత్తితో నష్టాలు

గంగరాజు – లక్ష్మి దంపతులు తమ కున్న పదెకరాల్లో ప్రస్తుతం పండ్ల తోటలు సాగుచేస్తున్నారు. గతంలో వరి, పత్తి పండించగా, పెట్టుబడి ఖర్చులు అధికమై, దిగుబడి, ధర సరిగా లేక ఆర్థికంగా నష్టపోయారు. పంటలు చేతికందే సమయంలో కోసేందుకు కూలీలు దొరకక అనేక ఇబ్బందులు పడ్డారు.

చాలా ఆనందంగా ఉంది..



గణతంత్ర వేడుకలకు మాకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం చాలా సంతోషంగా ఉంది. మట్టిని నమ్ముకుని వ్యవసాయం చేస్తే అభివృద్ధి బాట పట్టొచ్చు. అయితే సాధారణ పంటలు కాకుండా పండ్లతోటలు, ఇతర ఉద్యాన పంటలు వేస్తే లాభాలు అధికంగా ఉంటాయి. ఉద్యానశాఖ అధికారులు, కుటుంబసభ్యుల సహకారంతోనే నేడు ఈ స్థాయికి చేరుకున్నాం.

– పెనుబల్లి గంగరాజు, లక్ష్మి

కష్టానికి తగిన ఫలితం



గంగరాజు దంపతులు కష్టపడి పని చేసే మనస్తత్వం కలవారు. తెలియని విషయాలను ఒకటికి పదిసార్లు అడిగేవారు. జిల్లా నుంచి ఒక గిరిజన రైతును రిపబ్లిక్ డే వేడుకలకు పంపించాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. దీంతో ఇంకేమీ ఆలోచించకుండా గంగరాజు – లక్ష్మి దంపతుల పేరును ప్రతిపాదించాం.

– మరియన్న, ఉద్యానవన శాఖ ఏడీ

ఇక ఆ పంటలతో ఫలితం లేదని గ్రహించి మామిడి, యాపిల్‌బేర్, డ్రాగన్ ఫ్రూట్, పామాయిల్ సాగు చేస్తూ సేంద్రియ ఎరువులను మాత్రమే వాడుతూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉద్యాన అధికారుల చేయూత..

పండ్ల తోటల సాగులో ఉద్యానవన అధికారుల ప్రోత్సాహం ఎంతగానో ఉందని గంగరాజు చెబుతున్నాడు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడ రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినా తనతో అవగాహన కల్పిస్తున్నారని చెప్పాడు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి ఆ శాఖ ఏడీ మరియన్న, హెచ్ఈఓ శాంతిప్రియ ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందిస్తున్నారని, సాగులో తాము రాణించేలా ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నాడు. ఇప్పటివరకు తాను అధికారులతో కలిసి మహారాష్ట్ర, బెంగళూరు, హైదరాబాద్, అశ్వారావుపేట తదితర ప్రాంతాలకు వెళ్లి మవ్యవసాయ క్షేత్రాలను పరిశీలించానని తెలిపాడు.

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

- ఏప్రిల్ 4న పట్టభద్రుల తుది జాబితా విడుదల
- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి స్థానానికి జరుగుతున్న ఎన్నికలకు పట్టభద్రులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2020 నవంబర్ నాటికి డిగ్రీ, తత్సమాన ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. 2021 ఎన్నికల్లో జిల్లాలో 42,679 మంది ఓటుహక్కు కలిగి ఉన్నారని, ఇందులో ఈ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు 7,486 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఫారం 18 ద్వారా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని, అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా అవకాశం ఉందన్నారు. ఓటుహక్కు నమోదుకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు ఉందని, 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఆ జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలుంటే ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు తెలియజేయవచ్చని, వాటిని పరిష్కరించాక తుది జాబితా ఏప్రిల్ 4న ప్రకటిస్తామని వెల్లడించారు. దరఖాస్తుకు జత చేసే జిరాక్స్ పత్రాలపై డిజిగ్నేటెడ్ అధికారి లేదా గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలని సూచించారు. నమోదు ఫారంతో పాటు ఓటరు ఐడీ, ఆధార్ జిరాక్స్ ప్రతులను జత చేయాలన్నారు. గతంలో ఓటుహక్కు ఉన్న పట్టభద్రులు కూడా తిరిగి నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అధికారులు విచారణకు వచ్చినపుడు ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు, డీపీఆర్ఓ శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రంగాకిరణ్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి

ప్రభుత్వ ఆస్పత్రులలో గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని చెప్పారు. గర్భిణుల నమోదు తక్కువగా ఉన్న, ప్రసవాలు తక్కువగా జరిగిన ఆరోగ్య కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రసవాలకు గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకే వచ్చేలా సేవలు అందించాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాలపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచే నిరంతర పరీక్షలు చేయడం వల్ల రక్తహీనత బారి నుంచి కాపాడే అవకాశం ఉంటుందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ జేవీఎల్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్ఓలు సుకృత, రాజ్‌కుమార్, డీసీహెచ్ఎస్ రవిబాబు, సూపరింటెండెంట్ కుమారస్వామి, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి చైతన్య, ఇమ్యూనైజేషన్, మలేరియా, టీబీ, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారులు బాలాజీ, స్పందన, శ్రీనివాసరావు, మధువర్ధన్ పాల్గొన్నారు.

'అయోధ్య' సంకలనంలో స్థానం



ప్రభాకరాచార్యులు

అశ్వారావుపేటరూరల్: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రచురించిన 'అయోధ్య' కవితా సంకలనంలో అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రాసిన కవితకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌కు చెందిన జాతీయ సాహిత్య పరిషత్ వారు అయోధ్య సంకలనాన్ని విడుదల చేయగా, ఇందులో శ్రీరాముని మూర్తిమత్వాన్ని వర్ణిస్తూ తాను రచించిన 'శ్రీరామచంద్రుడు' అనే వచన కవిత సైతం ప్రచురితమైందని తెలిపారు. ఈ పుణ్యకార్యంలో తన కలానికి జాతీయ స్థాయిలో అవకాశం లభించడంతో తన జన్మ సార్థకమైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశం



షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్ : భద్రాచలంలోని మనుబోతుల చెరువు కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న డీఆర్‌సీసీ షెడ్ నిర్మాణ పనులను త్వరగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. షెడ్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఈ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను పీఓ ప్రతీక్ జైన్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు, నాయకులు హరిలాల్, ప్రసాదరావు, ముత్తయ్య, ఉమాదేవి, చంద్రకళ, రాణి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ కార్యాలయం తనిఖీ..

జీసీసీ కార్యాలయాన్ని పీఓ ప్రతీక్‌జైన్ మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని క్యాష్ బుక్, లైబులిటీ, బిల్లు ఓచర్‌లను పరిశీలించారు. కార్యాలయ సమయంలో విధులకు గైర్హాజరైన అకౌంటెంట్ బి.దీపాలాల్‌కు సోకాజ్ నోటీస్ జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, జీసీసీ మేనేజర్ దావిద్, సిబ్బంది పాల్గొన్నారు.

'గూడెం'లోనూ అవిశ్వాసం..

- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై 22 మంది కౌన్సిలర్ల తిరుగుబాటు
- అవిశ్వాస తీర్మాన కాపీ కలెక్టర్‌కు అందజేత
- నోటీసు జారీ చేస్తామన్న ప్రియాంక
- అవినీతి ఆరోపణలే ప్రధాన కారణం!



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన కాపీ అందజేస్తున్న కౌన్సిలర్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిపై పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. ఆమె చైర్‌పర్సన్‌గా ఎన్నికైనప్పటి నుంచీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, కౌన్సిలర్లను విభజించి పాలిస్తున్నారని, నిర్మాణ పనుల్లో కమీషన్ల దందాకు తెరలేపారని ఆరోపిస్తూ 22 మంది కౌన్సిలర్లు కలెక్టర్ ప్రియాంక ఆలను మంగళవారం కలిసి అవిశ్వాస తీర్మాన కాపీని అందజేశారు. ఈ మేరకు నోటీసు జారీ చేస్తామని కలెక్టర్ చెప్పారని కౌన్సిలర్లు వివరించారు. ఇల్లెందు మున్సిపాలిటీ బాటలోనే కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్లు పయనించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గం 2020లో ఎన్నిక కాగా, నాటి నుంచీ వివాదాలతోనే సాగుతోంది. అధికారులకు పాలకవర్గ సభ్యులకు మధ్య గొడవలు, చైర్‌పర్సన్‌కు – కౌన్సిలర్లకు మధ్య తగాదాలు, వ్యక్తిగత దూషణలతో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ పంచాయితీ రాజధాని వరకు చేరడంతో రాష్ట్ర నాయకత్వం కలుగజేసుకున్న ఘటనలూ ఉన్నాయి. ఇక్కడున్న 36 మంది కౌన్సిలర్లు మూడు వర్గాలుగా విడిపోయారు. అందులో ఒక వర్గం.. చైర్‌పర్సన్ అవినీతికి పాల్పడుతున్నారంటూ రుజువులతో బహిర్గతం చేసింది. ఇక తమ వార్డులకు నిధులు కేటాయించడం లేదంటూ కౌన్సిల్‌లో గొడవలు కూడా జరిగాయి. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పని చేశాయి. దీంతో ఈ ఐక్యత ఇలాగే కొనసాగుతుందని అనుకుంటుండగానే 22 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం కోసం కలెక్టర్‌ను కలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

కారణాలివేనా..?

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం కోసం 20 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో పాటు ఇద్దరు ఇండిపెండెంట్లు వినతిపత్రం అందజేశారు. మరో ఆరుగురు కౌన్సిలర్లు కూడా తమతో టచ్‌లో ఉన్నారని, ఈ ఘట్టం చివరినాటికి వారు కూడా వస్తారని 22 మంది కౌన్సిలర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలకు కలిసి రామవరంలో 2021లో ఫ్రెండ్లీ టోర్నమెంట్ నిర్వహించారు. ఆ ఖర్చును రూ.లక్షల్లో చూపిస్తూ చైర్‌పర్సన్ అవినీతికి పాల్పడ్డారంటూ ఓ వర్గం కౌన్సిలర్లు ప్రారంభించిన తగువు వివిధ అంశాలపై ఇంకా కొనసాగుతోంది. కాగా, సీతాలక్ష్మి అవినీతికి పాల్పడుతున్నారని, టెండర్లు నిర్వహించకుండానే నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారని తదితర ఫిర్యాదులతో అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందించారు. వారిలో 20 మంది బీఆర్‌ఎస్, ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారు. మిగతా 14 మందిలో ముగ్గురు సీపీఐ, ఒకరు కాంగ్రెస్, 10 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారు ఉన్నారు. ఈ 14 మందిలో ఎవరు ఎటువైపు మొగ్గు చూపుతారో వేచి చూడాలి. కాగా, మున్సిపాలిటీలో కౌన్సిలర్లు సైతం అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డుల్లో భూ కబ్జాలు, అక్రమంగా ఇంటి నంబర్లు.. ఇలా అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

కౌన్సిలర్లే కాపాడుకుంటారు

22 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారని తెలిసింది. దానిపై సంతకాలు చేసిన వారిలో చాలా మంది నాతో టచ్‌లో ఉన్నారు. వారే నన్ను కాపాడుతారనే నమ్మకం ఉంది. వచ్చే మున్సిపల్ ఎన్నికల వరకు నేనే చైర్‌పర్సన్‌గా ఉంటా.

– కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- ఖమ్మం జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు, 8,761 మంది విద్యార్థులు
- తొలిరోజు బీఆర్క్.. ఆపై జేఈఈ



ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షలు బుధవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఖమ్మం జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయగా, 8,761 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. తొలిరోజు బుధవారం బీఆర్క్ మొదటి విడత పరీక్షకు 1,071మంది, ఈనెల 27, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జరిగే జేఈఈ మొదటి విడత పరీక్షకు 7,960మంది హాజరుకానున్నారని బాధ్యులు వెల్లడించారు.

రెండు షిఫ్ట్‌ల్లో పరీక్ష

బీఆర్క్, జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు, సాయంత్రం 3నుంచి 6గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు గంట ముందు చేరుకోవాలని, అర గంట ముందు వరకే కేంద్రాల్లోకి అనుమతిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఉదయం పరీక్షకు 8–30గంటల తర్వాత, మధ్యాహ్నం పరీక్షకు 2–30గంటల తర్వాత అనుమతించేది లేదని తెలిపారు. కాగా, విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డుల్లో ఒకటి లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డుతో హాజరుకావాలని సూచించారు. అలాగే, పెన్ను, పెన్సిల్, రబ్బర్, స్కేల్, జామెట్రీ బాక్స్, వాటర్ బాటిల్ వెంట తీసుకువాల్సి ఉంటుంది.

ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప బృందం

అన్ని విభాగాల పరిశీలన



మెటర్నిటీ వార్డును పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మంగళవారం కాయకల్ప అసెస్మెంట్ బృందం పర్యటించింది. హుజూర్‌నగర్‌కు చెందిన వైద్య బృందం సభ్యులు రాజేశ్, మరో ముగ్గురు హెడ్ నర్సులు అసెస్మెంట్‌లో భాగంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. తర్వాత రాష్ట్రస్థాయి వైద్య బృందం ఎక్స్‌టర్నల్ విభాగాలను పరిశీలిస్తుంది. వీరి పరిశీలనలో వందకు గాను 70 మార్కులు వస్తే కాయకల్ప అవార్డుకు ఎంపికవుతుంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆస్పత్రికి రూ.50 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆస్పత్రికి రూ.25 లక్షలు ప్రోత్సాహక నగదును ప్రభుత్వం అందిస్తుంది. కాగా, ప్రజారోగ్య సంరక్షణ, పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ల నివారణ పద్ధతులను మెరుగుపరచడం, సిబ్బంది పనితీరు, రోగులకు అందించే సౌకర్యాలు, ప్రజారోగ్య వసతులు మెరుగుపరచడం వంటివి ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ సందర్భంగా బృందం సభ్యుడు డాక్టర్ రాజేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుభ్రతకు తొలి ప్రాధాన్యమివ్వాలని, వీటి ఆధారంగానే ప్రోత్సాహకాలు అందిస్తారని తెలిపారు. ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి ర్యాంకులు కేటాయిస్తామని వివరించారు. కాగా, గతంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి మూడుసార్లు కాయకల్ప అవార్డు దక్కింది. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్, హెడ్ నర్సులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

గుండాల: అడవుల్లో సంచరించే మూగ జీవాలను వేటాడి చంపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కాచనపల్లి రేంజ్ సుద్దరేవు బీట్‌లో జరుగుతున్న పనులను, అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవికాలం వస్తున్నందున తొట్లలో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్తగా పోడు నరికినా, జంతువులను వేటాడినా చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవుల సంరక్షణలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్లాంటేషన్‌లో మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పోయాలని సూచించారు. రానున్న వేసవిలో అడవులకు నిప్పుపెట్టకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అడవుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎఫ్‌డీఓ వెంకన్న, కాచనపల్లి, రేగళ్ల రేంజర్లు నాగేశ్వరావు, జశ్వంత్, మురళి, వెంకన్న, వీరేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్ణశాల, చిన్నఅరుణాచలం సందర్శన



చిన్నఅరుణాచలం ఆలయం వద్ద గౌతమ్‌సింగ్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌతమ్‌సింగ్ కుటుంబసమేతంగా పర్ణశాల, నరసాపురం చిన్నఅరుణాచలం ఆలయాలను మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌతమ్‌సింగ్ కుటుంబ సభ్యులు చిన్నఅరుణాచలం ఆలయానికి రూ.5000 గోపురం నిర్మాణానికి, అన్నదానానికి రూ.3 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవా, కృష్ణారెడ్డి, చిన్న అరుణాచలం ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి పాల్గొన్నారు.

మార్చి 31 వరకు బదిలీలు, డిప్యూటేషన్లపై నిషేధం

సింగరేణి(కొత్తగూడెం): ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలలు సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకతను పరిగణనలోకి తీసుకుని మార్చి 31వరకు కార్మికుల బదిలీలు, డిప్యూటేషన్లపై నిషేధం విధించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం మంగళవారం సర్క్యులర్ విడుదల చేసింది. ఒకవేళ ఎవరైనా బదిలీ, డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నా పరిశీలించబోమని అందులో వెల్లడించారు. కాగా, నవంబర్ 30న జరిగిన సింగరేణి ఎన్నికల సందర్భంగా ఆగస్టు నుంచి బదిలీలు నిలిపివేయగా, ఇప్పుడు మళ్లీ నిషేధం విధించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఈ నిషేధం కేవలం కార్మికులకే తప్ప అధికారులకు వర్తింపచేయకపోవడం సరికాదని చెబుతున్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

కొత్తగూడెంటౌన్: నాలుగు రోజుల కిందట కానరాకుండా పోయిన విద్యార్థి కుదుముల ప్రవీణ్‌కుమార్ ఆచూకీ గుర్తించామని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు. కొత్తగూడెం సన్యాసిబస్తీకి చెందిన ప్రవీణ్ పదో తరగతి చదువుతుండగా, ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అందిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో గుర్తించి ఆయన తల్లికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు




మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డీఐ సంపత్‌కుమార్

చర్లరూరల్: చర్లలోని మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విషయం తెలిసిన కొందరు యజమానులు షాపులు మూసివేశారు. మిగిలిన షాపుల్లో తనిఖీ చేసిన డీఐ మందులు, రశీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ షాపుల్లో తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని తెలిపారు. కొందరు యజమానులు వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయకపోవడంతో పాటు బిల్లులు ఇవ్వడం లేదని గుర్తించామన్నారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేసి వివరణ తీసుకున్నాక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ బి.రోహిత్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా కొత్తగూడెం వన్‌టౌన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న సాయికిశోర్‌రెడ్డిని దమ్మపేటకు, దమ్మపేటలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ రవికుమార్‌ను కొత్తగూడెం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. కొత్తగూడెం వన్‌టౌన్ అటాచ్డ్ తిరుపతిని వీఆర్‌లో ఉంచారు. కరకగూడెం (త్రీటౌన్ అటాచ్)లో పనిచేస్తున్న జీవన్‌రాజును జూలురుపాడుకు, జూలురుపాడులో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ పురుషోత్తంను త్రీటౌన్‌కు బదిలీ చేశారు.


నర్సరీల్లో విత్తనాలు నాటండి..



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ తదితరులు

పాల్వంచరూరల్: నర్సరీల్లో విత్తనాలను వెంటనే నాటాలని డీఆర్‌డీఓ, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బసవతరాకకాలనీ, కేశవాపురం, జగన్నాథపురం గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను మంగళవారం డీఆర్‌డీఓ సందర్శించి పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లోని సంచుల్లో మట్టిని నింపిన వెంటనే నిర్దేశించిన విత్తనాలను నాటి.. మొలకెత్తాక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ రంగా, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

డ్రైవరన్నా.. మీరే కీలకం



సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణమంటే ప్రజలకు భరోసా. నిశ్చింతంగా గుండెలపై చేయి వేసుకుని నిద్రించినా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతామని నమ్మకం. ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల పనితీరుతోనే ఈ నమ్మకం కొనసాగుతోంది. అందుకే ఎన్ని అవకాశాలు ఉన్నా, ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. అయితే, అక్కడక్కడా ప్రమాదాలు జరుగుతున్నా ఆర్టీసీ సంస్థపై, డ్రైవర్లపై నమ్మకం మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యాన డ్రైవర్లను గౌరవించుకునేలా ఆర్టీసీలో ఏడాదికోసారి డ్రైవర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈమేరకు బుధవారం డ్రైవర్ల దినోత్సవం జరపనున్న నేపథ్యాన కథనం.

రీజియన్‌లో డిపోల వారీగా డ్రైవర్లు

డిపో	ఆర్టీసీ డ్రైవర్లు	అద్దె బస్సు డ్రైవర్లు
ఖమ్మం	153	130
సత్తుపల్లి	107	94
భద్రాచలం	183	50
కొత్తగూడెం	70	62
మధిర	77	56
మణుగూరు	99	40
ఇల్లెందు	37	0
మొత్తం	726	432



సత్తుపల్లి డిపోలో ఏర్పాటుచేసిన డ్రైవర్స్ డే హోర్డింగ్

ఆర్టీసీలో ప్రయాణంపై ప్రజల్లో నమ్మకం

- డ్రైవర్ల చిత్తశుద్ధితోనే ఇది సాధ్యం
- నేడు డిపోల్లో డ్రైవర్ల దినోత్సవానికి ఏర్పాట్లు

రీజియన్‌లో..

ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు డిపోలు ఉన్నాయి.ఆయా డిపోల్లో బుధవారం డ్రైవర్ల దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రీజియన్ పరిధిలో 726 మంది ఆర్టీసీ డ్రైవర్లు, 432 మంది వరకు అద్దెబస్సుల డ్రైవర్లు ఉన్నారు. ప్రతిరోజు 1.30 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు తిరుగుతుండగా, సుమారు 2 లక్షల మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారు.

డొక్కు బస్సులతో అవస్థలు

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువగా కాలం చెల్లినవే ఉన్నాయి. పది లక్షలకుపైగా కిలోమీటర్లు తిరిగిన వాహనాలను గ్రామీణ ప్రాంతాలకు నడిపిస్తున్నారు. దీంతో ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితుల్లో డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారులు ఈ విషయం తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి ఎదరవుతోంది. అలాగే, ఏళ్ల తరబడి నియామకాలు చేపట్టక పోవటంతో ఉన్న డ్రైవర్లపైనే పనిభారం పడుతోందని చెబుతున్నారు.

శుభాకాంక్షలు, అవగాహన

డ్రైవర్ల దినోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం విధులకు హాజరయ్యే డ్రైవర్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పనున్నారు. అలాగే, ప్రమాదరహిత ప్రయాణాలపై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు. అంతేకాకుండా ప్రమాదరహితంగా బస్సులు నడిపిన డ్రైవర్లను ఎంపిక చేసి సన్మానించనున్నారు.

27 సంవత్సరాలుగా..



నేను 27 సంవత్సరాలుగా బస్సు నడుపుతున్నాం. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నదే లక్ష్యం. డిపో, రీజియన్ స్థాయిల్లో ఐదుసార్లు అవార్డులు తీసుకున్నా. తగినంత విశ్రాంతి, సరైన ఆహారం తీసుకుంటుండడంతోనే ప్రమాదాలకు తావివ్వలేదు.

– ఏవీఎస్.రావు, ఆర్టీసీ బస్సు డ్రైవర్, సత్తుపల్లి

చిన్నచూపు చూడొద్దు..



డ్రైవర్ ఉద్యోగం చాలా గొప్పదైనప్పటికీ సమాజంలో చిన్న చూపు ఉంది. సీట్‌లో 8 నుంచి 12 గంటలు కూర్చుని వేలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేది డ్రైవర్లే. ఇకనైనా అందరూ డ్రైవర్లను గౌరవించాలి. డిపోల్లో డ్రైవర్స్ డే నిర్వహణకు ఏర్పాట్లు చేశాం.

– సీహెచ్ వెంకన్న, రీజినల్ మేనేజర్, ఖమ్మం

క్రమశిక్షణతో పనిచేస్తే గుర్తింపు

కొత్తగూడెంరూరల్: క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్లలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏఆర్ సిబ్బందికి మొబిలైజేషన్ పరేడ్ షురూ అయింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ రోహిత్‌రాజు ముందుగా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతిఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, తద్వారా విధులు సక్రమంగా నిర్వర్తించగలుగుతారని తెలిపారు. 15 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, అడ్మిన్ ఆర్‌ఐ రవి, ఎంటీఓ సుధాకర్, హోంగార్డ్ ఆర్‌ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి..



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెంటౌన్: ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేష జీవితాన్ని ప్రశాంతంగా, ఆనందంగా గడపాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన అధికారి ప్రభాకర్‌రావును ఎస్పీ సన్మానించి మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింహారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణతో ప్రభాకర్‌రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి తీరుపై గ్రామస్తుల నిరసన



ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిని తక్షణమే ఇంకో చోటకు బదిలీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పాఠశాలలో ఫిజిక్స్ బోధించే ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడమే కాక బోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈ మేరకు గ్రామస్తులు పాఠశాల వద్దకు వచ్చి మంగళవారం ఆయనను నిలదీయగా గదిలోకి వెళ్లొస్తానని చెప్పి తిరిగిరాలేదు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. గతంలో నర్సాపురం పాఠశాలలో పనిచేసినప్పుడు ఓ ఉపాధ్యాయురాలు, బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తే అధికారులు సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత ఇక్కడకు వచ్చినా తీరు మారలేదని పేర్కొన్నారు. ఇకనైనా ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జయమ్మకు వినతి పత్రం అందజేశారు.

బాలుడి కిడ్నాప్‌నకు విఫలయత్నం

పట్టుకున్న గ్రామస్తులు

కొత్తగూడెంరూరల్: కారుకొండ పంచాయతీలోని హోలీతండాకు చెందిన కుమార్ కొడుకు గౌతమ్ (5)ను ఇద్దరు వ్యక్తులు ఆటోలో కిడ్నాప్ చేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. రుంద్రపూర్, బోడగుట్ట నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు తండాలో ఆడుకుంటున్న గౌతమ్‌ను ఆటోలో తీసుకొని వెళ్తుండగా కారుకొండ వాగు వద్ద ఐదుగురు వ్యక్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే, ఎస్‌ఐ సంతోష్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, విచారణ చేస్తున్నామని చెప్పారు.

జీపీ కార్యాలయానికి తాళం వేసిన సర్పంచ్

సుజాతనగర్: గ్రామసభ సమాచారం తనకు ఇవ్వలేదని అలకబూనిన సర్పంచ్ చివరకు గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశాడు. ఈ ఘటన సుజాతనగర్ మండల పరిధిలోని పాత అంజనాపురం గ్రామ పంచాయతీలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీడీపీ)కి సంబంధించిన గ్రామసభ పంచాయతీ కార్యాలయంలో జరగాల్సి ఉంది. పంచాయతీ సిబ్బంది ద్వారా గ్రామసభ సమాచారాన్ని గ్రామంలో తెలియజేశారు. కాగా, గ్రామసభ ఉందనే విషయం తనకు ఎందుకు చెప్పలేదంటూ పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయానికి తాళం వేశాడు. దీంతో గ్రామసభ జరగకుండానే మరో రోజుకి వాయిదా పడినట్లు తెలిసింది.

విద్యార్థిని ఆత్మహత్య

పినపాక: పురుగులమందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మద్దులగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పర్షిక శైలజ(19) మణుగూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో నర్సింగ్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన కొందరు ఆమెని దూషించడంతో పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు పినపాక ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్పయ్య తెలిపారు.

మద్యానికి బానిసైన యువకుడు..

అన్నపురెడ్డిపల్లి: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన మద్దెబోయిన శ్రీను(23) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కూలీ పనులు చేస్తూ తల్లి దగ్గర ఉంటున్నాడు. మధ్యాహ్న సమయంలో మద్యం మత్తులో ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరివేసుకున్నాడు. గమనించిన తల్లి స్థానికుల సహాయంతో పీహెచ్‌సీకి తరలించే క్రమంలోన మృతి చెందాడు. ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ నిందితుడు అరెస్ట్

పాల్వంచ: రాయల్ ఎన్‌ఫీల్డ్ బండి చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ ఎస్‌ఐ బి.రాము కథనం ప్రకారం.. పట్టణంలోని వనమాకాలనీకి చెందిన కొప్పుల వికాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గతేడాది నవంబర్ 30వ తేదీన పాల్వంచలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చాడు. ఆ రోజు రాత్రి ఇంటి ముందు రాయల్ ఎన్‌ఫీల్డ్ బండిని పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి బండి కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డిసెంబర్ 6వ తేదీన పాల్వంచ నవభారత్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రేగళ్లకు చెందిన బింగి కమల్ కొత్తగూడెం వైపు నుంచి పాల్వంచ వస్తుండగా ఆపి బండి పత్రాలు చూపించమని చెప్పగా, కొత్తగూడెం హేమచంద్రాపురానికి చెందిన బైక్ మెకానిక్ అయిన తన స్నేహితుడు కంచర్ల అరవింద్‌రెడ్డి తన వద్ద రూ.25 వేలు అప్పు తీసుకుని కుదవపెట్టాడని తెలిపాడు. అప్పు తిరిగి ఇచ్చే వరకు నంబర్ ప్లేట్ లేకుండా వాడమని చెప్పాడని తెలిపాడు. కానీ, బండిని చోరీ చేసినట్లు భావించి అరవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడు తన అనుభవంతో పాల్వంచ, కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లు చోరీ చేసి వాటి పార్టులు విడదీసి, ఇంజన్ నంబర్లు చెరిపి, వాటిని అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని, మంగళవారం అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధి కుక్కల స్వైరవిహారం



చనిపోయిన మేకలను పరిశీలిస్తున్న వార్డు కౌన్సిలర్, స్థానికులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం కూలీలైన్‌లో వీధి కుక్కల దాడిలో 3 మేకలు మృతి చెందగా, ఆరు మేకలకు తీవ్ర గాయాలయ్యాయి. కూలీలైన్‌లో వీధి కుక్కలు గాజుల శ్రీనివాస్ ఇంట్లో చొరబడి మేకలపై దాడి చేసి మూడు మేకలను చంపాయి. ఆరు మేకలను గాయపర్చాయి. దీంతో రూ.లక్ష ఆర్థికంగా నష్టం జరిగిందని గాజుల శ్రీనివాస్ వాపోయాడు. వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు శ్రీనివాస్‌ను పరామర్శించి, మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ రఘు ఘటనా స్థలానికి మున్సిపల్ అధికారులను, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌ను పంపించి కుక్కలను పట్టిస్తామని, కోతులను కూడా బోన్లు తెప్పించి పట్టిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగు చోరీ

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ
- చోరీకి గురైన సొత్తు విలువ రూ.18 లక్షల పైనే..

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలి నుంచి గుర్తు తెలియని దుండగులు భారీ స్థాయిలో బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళవారం బాధితురాలు వివరాలు తెలిపారు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన అంగోతు లలిత సోమవారం సాయంత్రం సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో అశ్వారావుపేట వైపు వస్తున్న ఏపీ 29జెడ్ 1664 బస్సు ఎక్కింది. కాగా తనతోపాటు తెచ్చుకున్న బ్యాగులో దుస్తులతోపాటు బంగారు, వెండి ఆభరణాలు భద్రపరుచుకుంది. సత్తుపల్లి దాటిన తర్వాత సుమారు మెడిశెట్టివారిపాలెం స్టేజీ దగ్గర్లో గుర్తుతెలియని మహిళలు లలిత జడను వెనక్కి లాగడంతో ఆమె వెనుతిరిగి చూసే సమయంలో బ్యాగులో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాల బాక్సుతోపాటు రూ.11 వేల నగదును అపహరించారు. అయితే బాధితురాలు అశ్వారావుపేట బస్టాండ్‌కు వచ్చిన తర్వాత బ్యాగును కత్తిరించి ఉండటాన్ని గుర్తించి చూడగా బ్యాగులో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు కనిపించలేదు. ఆభరణాల విలువ సుమారు రూ.18 లక్షలకు పైనే ఉంటుందని అంచనా. చోరీకి గురైన బంగారు ఆభరణాల్లో హారం, నల్లపూసలగొలుసు, మూడు చైన్‌లు, రెండు బ్రాస్‌లెట్లు, మూడు ఉంగరాలు, హారం, మాటీలు, నెక్లెస్, చెవిదిద్దులు, వెండి కుంకుమ భరిణె, పట్టీలు ఉన్నాయని బాధితురాలు వాపోయింది. కాగా, ఈ ఘటనపై ఎస్‌ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా లిఖితపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో గంజాయి మాయం..?

బూర్గంపాడు: వాహనాల తనిఖీలు, దాడుల్లో పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన గంజాయి ప్యాకెట్లు మాయమైనట్లుగా మండలంలో చర్చసాగుతోంది. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను ఇటీవల నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. పాత పోలీస్‌స్టేషన్‌లో నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచారు. అయితే, పాత పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన కొన్ని గంజాయి ప్యాకెట్లు, రెండు ద్విచక్రవాహనాలు మాయమైనట్లుగా మంగళవారం సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. కాగా, ఈ ఘటనల్లో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సారపాకకు చెందిన గంజాయి రవాణా చేసే యువకులు వీటిని చోరీ చేసినట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఎలాంటి గంజాయి ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాలు మాయం కాలేదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం అవాస్తవమని కొట్టిపారేశారు.

'గంజాయి' కేసులో కానిస్టేబుల్ అరెస్ట్

భద్రాచలంఅర్బన్: గంజాయి విక్రయించిన కేసులో విచారణ నిమిత్తం భద్రాచలంటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పాడియం రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాడియం రమేశ్ నిత్యం క్రికెట్ బెట్టింగ్‌తో పాటు ఇతర ఆన్‌లైన్ ఆటలు ఆడుతూ నగదు పోగొట్టుకున్నాడు. స్నేహితుల వద్ద అప్పు చేశాడు. ఈ క్రమంలో రమేశ్ భద్రాచలం బ్రిడ్జిసెంటర్‌లో చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ గంజాయి స్మగ్లర్ రమేశ్‌ను చూసి గంజాయిని ప్యాకెట్లను అక్కడే విసిరేసి పరారయ్యాడు. ఈ సమయంలో అక్కడ కేవలం రమేశ్ ఒక్కడే ఉండటంతో ఆ గంజాయిని విక్రయిస్తే కొంత నగదు వస్తుందనే ఆశతో ఆ ప్యాకెట్లను ఓ వ్యక్తికి విక్రయించాడు. దీనిని కొనుగోలు చేసిన వ్యక్తి జయశంకర్ భూపాలపల్లికి చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో జయశంకర్ భూపాలపల్లికి చెందిన వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో మంగళవారం ఉదయం జయశంకర్ భూపాలపల్లికి చెందిన పోలీసులు భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని రమేశ్‌ను విచారణ నిమిత్తం అరెస్టు చేశారు.

22 కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

బూర్గంపాడు: సారపాకలో వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సీఐ వినయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి సారపాక ప్రధాన కూడలిలో ఎస్‌ఐ రాజ్‌కుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా స్కూటీపై వస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. వారి వద్ద బ్యాగులో 22 కిలోల గంజాయి ప్యాకెట్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఒకరు గిరిబోయిన విష్ణువర్దన్.. మిగిలిన ఇద్దరు సారపాక, బూర్గంపాడుకు చెందిన మైనర్లని విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొమరారం గ్రామానికి చెందిన ఆవుదొడ్డి గోపాల్ తన బైక్‌పై పోచారం వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపుతప్పి నేరుగా చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను స్థానికులు కొమరారం పీహెచ్‌సీకి అక్కడి నుంచి ఇల్లెందుకు చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు ఖమ్మంకు సిఫారసు చేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి కార్మికుడు మృతి

గుండాల: ట్రాక్టర్ బోల్తాపడి పంచాయతీ కార్మికుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని సాయనపల్లి గ్రామానికి చెందిన బొమ్మర్ల రామ్మూర్తి (32) పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ట్యాంకర్‌తో గుండాల – సాయనపల్లి గ్రామాల మధ్య రోడ్డుకిరువైపులా ఉన్న మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు. జమ్మిచెరువు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీకొట్టింది. డ్రైవర్ ఇంజన్ కిందపడి మృతి చెందాడు. సీఐ రవీందర్, ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉంది.

చికిత్స పొందుతున్న మహిళ...

ములకలపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అన్నపురెడ్డిపల్లికి చెందిన బన్నె లక్ష్మి (32)కి, మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వేణుబాబుతో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. మూడేళ్లుగా లక్ష్మి తరచూ అనారోగ్యానికి గురవుతోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగింది. చుట్టుపక్కలవారు గమనించి కుటుంబీకుల సాయంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందింది. మృతురాలి తల్లి బొల్లె మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజమౌళి తెలిపారు.

మనస్తాపానికి గురై వివాహిత..

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వివాహిత చికిత్స పొందుతున్న క్రమంలో మృతి చెందింది. స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్త కావడిగుండ్ల గ్రామానికి చెందిన సోడెం వరలక్ష్మి(22)కి మూడేళ్ల కిందట వివాహం కాగా, కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతోంది. మనస్తాపానికి గురై ఈ నెల 20వ తేదీన పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం మృతురాలి తండ్రి పెడకం పాట్టి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్లగూడెం వాసి..

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెంనికి చెందిన కొమరం చంద్రయ్య (50) పురుగులమందు తాగాడు. ఆస్పత్రి చేరి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ గణేశ్ కథనం ప్రకారం.. చంద్రయ్య ఈ నెల 1వ తేదీన ఇంట్లో జరిగిన గొడవలతో మనస్తాపం చెంది పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీలో ధిక్కార స్వరం

తమ సంగతి తేల్చాలని ఎక్కడికక్కడ నేతల పట్టు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పరిస్థితి 'ముందు గొయ్యి.. వెనుక నుయ్యి'లా తయారైంది. పార్టీ టికెట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోలేక తల బొప్పి కట్టిపోతోంది. జనసేనతో పొత్తుపై పార్టీ నేతలంతా పెదవి విరుస్తుండటంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. తమ టికెట్ సంగతి తేలిస్తేనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటామని ఎక్కడికక్కడ నేతలు తెగేసి చెబుతుండటంతో తండ్రీ కొడుకులకు నిద్ర కరువైంది.

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఇప్పటికే పాతాళానికి కుంగిన ఆ పార్టీ.. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇంకా లోతుకు కూరుకుపోతోంది. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే పూర్తిగా అయోమయం నెలకొంది. పలుచోట్ల పార్టీకి ఇన్‌ఛార్జిలు లేకపోవడాన్ని బట్టే ఆ పార్టీ పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమవుతోంది. నాయకులు ఉన్న చోట కూడా కుమ్ములాటలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలోనే విజయవాడ ఎంపీ కేశినేని నాని ఆ పార్టీకి రాజీనామా చేశారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. అదే బాటలో మరికొందరు టీడీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేనతో ఇప్పటికే పొత్తులో ఉంటూ.. బీజేపీతో కూడా పొత్తు ప్రయత్నాలు చేస్తుండటంతో గందరగోళం ఇంకా పెరిగిపోయింది. తమ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందో, ఏ స్థానంలో తాము పోటీలో ఉంటామో తెలియక టీడీపీ క్యాడర్ అయోమయంలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో పలుచోట్ల కీలక నేతలు చంద్రబాబును ధిక్కరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనకుండా ముందు తమ సంగతి తేల్చాలని పట్టుబడుతున్నారు.

గాల్లో గంటా శ్రీనివాసరావు సీటు

సీనియర్ నేత గంటా శ్రీనివాసరావును చంద్రబాబు గాల్లో పెట్టడంతో ఆయన అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకసారి గెలిచిన చోట మళ్లీ పోటీ చేయని గంటా వచ్చే ఎన్నికల్లో తనకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల సీటు ఇవ్వాలని కోరుతుండగా చంద్రబాబు ఎటూ తేల్చడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఆయన తంటాలు పడుతున్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబం కూడా టీడీపీపై రగిలిపోతోంది. పార్టీకి అండగా ఉన్న తమను దూరం పెడుతున్నారని వాపోతోంది. అయ్యన్న తనకు అనకాపల్లి ఎమ్మెల్యే సీటు, తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కానీ ఎవరో ఒకరికి మాత్రమే సీటు ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేయంతో అయ్యన్న అలక వహించారు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా.. మౌనంగా ఉంటున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి సీటు జనసేనకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అసంతృప్తితో రగిలి పోతున్నారు. తన సీటు జనసేనకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్న ఆయన.. అవసరమైతే పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు సీట్లు ఇవ్వకపోతే టీడీపీ సంగతి చూస్తామని గాజువాక, అనకాపల్లి నేతలు పల్లా శ్రీనివాసరావు, పీలా గోవిండ్‌లు అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేశారు.

కాకినాడలో టీడీపీకి హెచ్చరికలు

కాకినాడ సిటీ స్థానాన్ని జనసేనకు ఇస్తే తాను మరో దారి చూసుకుంటానని మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు స్పష్టం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఇప్పటికే బహిరంగంగా తన సీటు జనసేనకు ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ ఇస్తే తాను ప్రత్యామ్నాయం చూసుకుంటానని హెచ్చరించారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ కూడా పార్టీని ధిక్కరిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సీటు తనకివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతుండగా, చంద్రబాబు మరో వ్యక్తికి ఇవ్వాలని చూస్తున్నారు. తేడా వస్తే ఆయన జంప్ అవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ నేతల మధ్య జనసేన చిచ్చు పెట్టింది. ఇక్కడ అధిక శాతం సీట్లు జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో టీడీపీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

దేవినేని ఉమకు సీటు లేదు

ఎన్టీఆర్ జిల్లాలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు సీటు లేదని చెప్పడంతో ఆయన లోలోన కుంగిపోతూ ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. మైలవరం సీటును ఆయనకు కాదని కొత్త వ్యక్తికి ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పని చేసిన తనను మోసం చేశారని వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో దివంగత కోడెల శివప్రసాద్ తనయుడు శివరామ్ ఇప్పటికే తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఆయన స్థానంలో బీజేపీ నుంచి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి సీటు ఇస్తుండడంతో ఆయన టీడీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. చిలకలూరిపేట సీటు విషయంలో భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మధ్య పోటీ నెలకొంది. సీటు లేకపోతే టీడీపీని వదిలేందుకు పుల్లారావు ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు సిటీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉండడంతో మొదటి నుంచి అక్కడ పని చేసిన మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనకు న్యాయం దక్కలేదంటూ ఆయన టీడీపీని వీడాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అనంత, కర్నూలు జిల్లాల్లోనూ అదే తీరు

ఉమ్మడి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ప్రస్తుత ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి గ్రూపులు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నాయి. ఎవరికి సీటిచ్చినా రెండో వర్గం తిరుగుబాటు చేసే పరిస్థితి నెలకొంది. మరోవైపు ధర్మవరం ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ అక్కడి నుంచి పోటీ చేయాలని చూస్తుండగా, గత ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీలోకి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి సీటు తనదేనని చెప్పుకుంటున్నారు. దీంతో పరిటాల ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తనను నమ్మించి పని చేయించుకుని ఇప్పుడు మాట మారిస్తే ఊరుకోనని ఆయన హెచ్చరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒకరికే టికెట్ అని చంద్రబాబు చెప్పడంతో రాప్తాడులో పరిటాల సునీత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల ఇన్‌ఛార్జిగా భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమించడంతో ఆ నియోజకవర్గంలో అసమ్మతి రాజుకుంది. బ్రహ్మానందరెడ్డి టీడీపీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆలూరు సీటు ఇవ్వకపోతే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన సతీమణి సుజాతమ్మ చంద్రబాబుకు ఝలక్ ఇవ్వనున్నారు. డోన్ అభ్యర్థిగా చంద్రబాబు.. ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించగా, కేఈ ప్రభాకర్ తాను రేసులో ఉన్నట్లు స్పష్టం చేశారు. చంద్రబాబు తీరుపై కేఈ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆళ్లగడ్డ సీటు జనసేనకు కేటాయిస్తారనే ప్రచారంతో మాజీ మంత్రి అఖిలప్రియ మండిపడుతున్నారు. అదే జరిగితే ఆమె టీడీపీకి గుడ్‌బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

మీరే నా స్టార్ క్యాంపెయినర్లు

- మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా ప్రచారకర్తలు
- ఉరవకొండ సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్


లబ్ధిదారుల సమక్షంలో బటన్ నొక్కి నాలుగో విడత ఆసరా నిధులను విడుదల చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అనంతపురం (ఉరవకొండ) : 'ప్రజలకు ఏ మంచీ చేయని వారికి, ప్రజలను మోసం చేసిన వారికి ఇంత మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారు. ప్రతి పేద ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించిన మీ బిడ్డకు, మంచి చేసిన మీ బిడ్డకు ఎలాంటి స్టార్ క్యాంపెయినర్లు లేరు. అయితే మీ బిడ్డ వాళ్లెవరినీ నమ్ముకోలేదు. వీళ్లందరి కంటే ఎక్కువగా నాకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని గట్టిగా చెబుతున్నాను. మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఆయన వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగవ విడత నిధుల విడుదల సభలో మాట్లాడారు. 'జెండాలు జత కట్టడమే వారి ఎజెండా.. జనం గుండెల్లో గుడి కట్టడమే మీ జగన్ ఎజెండా' అని తెలిపారు. వారందరికీ భిన్నంగా తనకున్నంత మంది స్టార్ క్యాంపెయినర్లు దేశ చరిత్రలోనే కాదు.. రాజకీయ చరిత్రలో ఎవరికి ఉండరన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మాత్రం మీరే మీ బిడ్డకు స్టార్ క్యాంపెయినర్లుగా నిలవాలని కోరారు. జరుగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో మీ బిడ్డకు మీరే సైనికుల్లా నిలవాలన్నారు. మనం వేసే ఓటు.. నొక్కే బటన్ ఎందుకు నొక్కుతున్నామో మనసులో పెట్టుకోవాలని చెప్పారు. మీరు వేసే ఓటు ఒక్క జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడమే కాదు.. పేద కుటుంబాలు పేదరికం నుంచి బయట పడేందుకనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటేనే అది జరుగుతుందని మనసులో పెట్టుకోవాలని చెప్పారు.

దురుద్దేశాలతోనే నాపై 'పిల్'

- నా ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ వ్యాజ్యం
- నాపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఎంపీ రఘురామకృష్ణరాజు పని
- హైకోర్టులో సీఎం వైఎస్ జగన్ ప్రాథమిక కౌంటర్ దాఖలు

సాక్షి, అమరావతి: దురుద్దేశాలు, రాజకీయ కారణాలతో ఎంపీ రఘురామకృష్ణరాజు తనపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హైకోర్టుకు నివేదించారు. తనపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారని వివరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు అతనిపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ స్పీకర్‌కు తమ పార్టీ తరఫున లేఖ రాశామన్నారు. ఈ కారణంతోనే అప్పటి నుంచి రాఘురామకృష్ణరాజు తనపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నారని తెలిపారు. తనపై ద్వేషాన్ని తెలియజేసేందుకు ఆయన పలు మార్గాలను ఎంచుకున్నారని వివరించారు. అతని కక్షపూరిత ధోరణి, శతృత్వం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇందులో భాగంగా.. అనేక సందర్భాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారని జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. ఇదే రీతిలో రాజ్యాంగపరంగా ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు, అధికారులపై కూడా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. తనపై పలు నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తూ తన బెయిల్‌ను రద్దుచేయాలంటూ రఘురామకృష్ణరాజు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారని, ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేకపోవడంతో హైకోర్టు దానిని కొట్టేసిందన్నారు. నిజానికి.. ఆయన సదుద్దేశంతో కోర్టును ఆశ్రయించలేదని తెలిపారు. అతనిపై ఉన్న క్రిమినల్ కేసుల గురించి తన పిటిషన్‌లో ప్రస్తావించకుండా దాచిపెట్టారని సీఎం వివరించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌ను భారీ జరిమానాతో కొట్టేయాలని ముఖ్యమంత్రి జగన్ న్యాయస్థానాన్ని కోరారు. అంతేకాక.. ప్రతివాదుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని కూడా అభ్యర్థించారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు, ఆయా ప్రభుత్వ శాఖల పనితీరుపై దూషణలు చేసేందుకే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని ఆయన తన కౌంటర్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలపై సీబీఐ దర్యాప్తు జరపండి..

రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు ఆ పథకాలవల్ల పలువురికి లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని.. వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ పిల్ విచారణార్హతపై అభ్యంతరం లేవనెత్తారు. దీంతో న్యాయస్థానం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డితో సహా 40 మందికి నోటీసులు జారీచేసి, పిల్ విచారణార్హతపై అభ్యంతరాలుంటే తెలియజేస్తూ అఫిడవిట్‌లు దాఖలుచేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి తన అభ్యంతరాలతో ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

ఆలయాభివృద్ధికి రూ.2.02 లక్షల వితరణ


ఆలయంలో విరాళం అందజేసిన భక్తులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని మెట్టాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి పలువురు విరాళాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాలనేని కాంతారావు – భవానీ దంపతులు రూ.1,01,116, వేముల ప్రసాద్ – సుఖరాణి దంపతులు రూ.1,01,116ను మంగళవారం విరాళంగా అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మందపాటి రవీందర్‌రెడ్డి, మల్లూరు అంకమరాజు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన వైటీసీ భవనంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాబ్‌మేళాకు ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది హాజరు కాగా, వివిధ సంస్థల బాధ్యులు 42 మందిని ఎంపిక చేశాయని తెలిపారు. అలాగే, ఉపాధి శిక్షణ కోసం 58 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో జేడీఎం వేల్పుల హరికృష్ణ, కంపెనీల ప్రతినిధులు నర్సింహారావు, కృష్ణ, భార్గవ్, సమ్మయ్య, పూజిత, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ప్రతిష్ఠ.. ఇక్కడ ప్రసవం!

- అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ ముహూర్తాన్ని ప్రసవానికి ఎంచుకున్న గర్భిణులు
- భద్రాద్రిలో ఒకేరోజు 23 ప్రసవాలు
- జీవితాంతం గుర్తుంటుందంటూ ఆనందం
- రాముడి పేరు వచ్చేలా నామకరణానికి సిద్ధం

భద్రాచలంఅర్బన్: దేశ ప్రజలందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లుగా అయోధ్యలోని మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనను దేశంలోనే అద్భుతమైన అధ్యాయంగా చెబుతున్నారు. ఎంతో గొప్ప ముహూర్తం కావడంతోనే విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎంచుకున్నారని భావిస్తున్న పలువురు గర్భిణులు ఇదే రోజు బిడ్డకు జన్మనివ్వాలని నిర్ణయించుకున్నారు. నెలలు నిండిన వారు ముందుగానే కుటుంబీకుల సహకారంతో ఆస్పత్రుల్లో చేరి సోమవారం ప్రసవించారు. తద్వారా రాముడు కొలువుదీరిన రోజునే తమ ఇంట్లోకి బిడ్డ అడుగు పెట్టిందని ఆనందించారు. కాగా, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమవారం 23 ప్రసవాలు జరిగాయి. పట్టణంలోని ఒక్క జీవన్ ఆస్పత్రిలోనే 14 మంది చిన్నారులు జన్మించగా.. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎనిమిది మంది పిల్లలు జన్మించారు. భద్రాచలంలోని అన్ని ఆస్పత్రుల్లో సోమవారం 23 మంది గర్భిణులు ప్రసవించారని అధికారులు తెలిపారు.


అప్పుడే పుట్టిన శిశువుతో డాక్టర్ స్పందన



ఇది అరుదైన అవకాశం..

నాకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆడబిడ్డ జన్మించింది. ఈ రోజు నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోతుంది. మా పాప ఈ విషయాన్ని తన స్నేహితులకు చెప్పుకుని ఆనందించడం ఖాయం. ఇది ఆ రాముడే మాకు ఇచ్చిన అపురూప అవకాశంగా భావిస్తున్నాం.

–శ్రావణి, ఏఎస్ఆర్ కాలనీ, భద్రాచలం



మరువలేని రోజు

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన రోజున 14 మందికి ప్రసవాలు చేయడం మరువలేను. వైద్యవృత్తిలో ఇది ఒక మైలు రాయిలా గుర్తుండిపోతుంది. దక్షిణ అయోధ్యగా పిలిచే భద్రాచలంలో వైద్యసేవలు అందించడాన్ని ఎంతో సంతోషంగా భావిస్తున్నా.

–డాక్టర్ స్పందన, స్త్రీ వైద్య నిపుణులు, భద్రాచలం



రామ్ అనే వచ్చే పేరు పెడతాం..

సరిగ్గా సోమవారం మధ్యాహ్నం 12–30 గంటలకు నేను బాబుకు జన్మనిచ్చా. రామ్ అనే పేరు వచ్చేలా మా బిడ్డకు నామకరణం చేయాలని నిర్ణయించుకున్నాం. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సమయంలోనే నాకు మగబిడ్డ పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమనే చెప్పాలి.

–అవినీడి కృష్ణవేణి, రెడ్డిపాలెం

ప్రకృతి వ్యవసాయానికి సహకరిస్తాం..

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

దుమ్ముగూడెం: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడానికి ప్రకృతి వ్యవసాయ విధానాలను ఐటీడీఏ ప్రోత్సహిస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం పథకం అమల్లో భాగంగా సాధ్యాసాధ్యాలు తెలుసుకోవడానికి ఆయన మంగళవారం రైతులతో సమావేశమయ్యారు. దుమ్ముగూడెం మండలంలోని సింగవరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులైన సుమారు 100 మంది గిరిజన రైతులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అక్కడ పండించే పంటలు, పెట్టుబడి, ఆదాయం, నీటి పారుదల సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం పథకం అమలుకు కావాల్సిన సామగ్రి, జీవామృతం, ఘనామృతం తయారీకి అవసరమైన పదార్థాలను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పనకు సర్వే చేయాలని ఎలక్ట్రికల్ ఏఈకి సూచించారు. అనంతరం ఎస్.లక్ష్మీపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లిన పీఓ.. వరదలతో శిథిలమైన ఎస్.లక్ష్మీపురం–సింగవరం మధ్య కాజ్‌వేను పరిశీలించారు. అలాగే, ఎస్.లక్ష్మీపురంలో గిరిజన రైతు ముర్రం సత్తిబాబు ఇంటికి వెళ్లి ప్రకృతి వ్యవసాయం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించిన వైనంపై చర్చించారు. వ్యవసాయాధికారి ఉదయ్‌భాస్కర్, ఏఈ మోహన్‌రెడ్డి, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు నూప సీతయ్య పాల్గొన్నారు.


రైతులతో చర్చిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్


ఎస్.లక్ష్మీపురం – సింగవరం మధ్య వాగు దాటుతున్న పీఓ

సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణపై గ్రామసభ

దుమ్ముగూడెం: సీతమ్మసాగర్ ప్రాజెక్టు రెండో విడత భూసేకరణకు గాను దుమ్ముగూడెం మండలం పర్ణశాల గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం పీసా గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కొమరం దామోదరరావు మాట్లాడుతూ.. పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మిస్తున్నందున ప్రాజెక్టు పనులు నిలిపేయాలని కోర్టు ఆదేశిస్తే సభ ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. అయితే, ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలతో సభ ఏర్పాటు చేశామని తహసీల్దార్ చంద్రశేఖర్ బదులిచ్చారు. కాగా, 500 ఏళ్ల నాటి ముత్యాలమ్మ దేవత విగ్రహం ఉన్న స్థలం కూడా భూసేకరణలో పోనున్నందున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నిర్వాసితులు లక్ష్మయ్య, ఆదినారాయణ, నర్సయ్య, లక్ష్మి, వాగె ఖాదర్‌బాబు, వాగె రాజేశ్వరి, పొడియం వెంకటరమణ, పి.లలిత, తుష్టి కామరాజు, పూనెం భూపతిరాజు, పాయం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం పాలేరు నియోజకవర్గ దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న 163మందిలో 116 మంది హాజరయ్యారు. వీరిలో 72 మందిని సదరం సర్టిఫికెట్లకు అర్హులుగా గుర్తించినట్లు వైద్యులు వెల్లడించారు. – ఖమ్మంవైద్యవిభాగం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

సదరం క్యాంపునకు బారులు..


క్యూలో నిలుచున్న దివ్యాంగులు

ఉత్తమ అధికారులు, కార్మికులు వీరే..

జాబితా విడుదల చేసిన సింగరేణి

సింగరేణి(కొత్తగూడెం): రానున్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. వారిని ఈ నెల 26వ తేదీన నిర్వహించే వేడుకల్లో సన్మానించనున్నారు. ఈ మేరకు అధికారులకు సంబంధించి కార్పొరేట్ ఏరియాలో జీఎం పర్సనల్ కట్టా బసవయ్య, సింగరేణిభవన్‌లో జీఎం మాసిరగాని సురేశ్, కొత్తగూడెం ఏరియాలో పీవీకే–5 ఇంక్లైన్‌లో డీవైఎస్ఈ చిట్టూరి శ్రీనివాస్, ఇల్లెందు ఏరియాలోని ఈఈ బోడ నాగేశ్వరరావు, మణుగూరు ఏరియాలోని పీకేఓసీలో సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్జీ–1లో జీడీకే – సీఎం కాలరీ మేనేజర్ అనిల్, ఆర్జీ–2 ఏరియాలోని జీడీకేఓసీ–3లో అడిషనల్ మేనేజర్ ఆర్.రమేశ్, ఆర్జీ–3 ఏరియాలో సీహెచ్‌పీ డీవైజీఎం మాగంటి కేశవరావు, భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ–2లో డీవైజీఎం టి.వెంకటేశ్వరరెడ్డి, బెల్లంపల్లి ఏరియాలో అడిషనల్ జీఎం మోకాళ్ల తిరుమల్‌రావు, మందమర్రి ఏరియాలో ఏజీఎం జోస్యుల నాగరాజు, శ్రీరాంపూర్ ఏరియాలో డీవైఎస్ఎస్ఓ ఎన్నపురెడ్డి సంపత్, ఎస్టీపీసీలో ఏజీఎం కె.సత్యనారాయణ ప్రసాద్ ఎంపికయ్యారు. అలాగే, కార్మికుల విభాగంలో భూపాలపల్లి ఏరియాలో కేటీకే ఓసీ–3 సర్వేయర్ కవాటి రమేశ్, ఆర్జీ–3 ఏరియాలోని ఈపీ ఆపరేటర్ ప్రకాశ్‌లాల్‌శర్మ, అండ్రియాల ప్రాజెక్ట్‌లో హెడ్ ఓవర్‌మెన్ అప్పాల లక్ష్మీనారాయణ, ఆర్జీ–2 ఏరియాలో ఈపీ ఆపరేటర్ రాజా అలీ, ఆర్జీ–1 ఏరియాలో ఎల్‌హెచ్‌డీ పేరేటి భగవాన్‌రెడ్డి, బెల్లంపల్లి ఏరియాలో ఈపీ ఆపరేటర్ గొల్ల కృష్ణ, మందమర్రి ఏరియాలో జనరల్ మజ్దూర్ కె.జెస్సీరాజ్, శ్రీరాంపూర్ ఏరియాలో కోల్ కట్టర్ మధూకర్, మణుగూరు ఏరియాలో కన్వేయర్ ఆపరేటర్ సుందర్‌రాజన్ నల్లాన్, ఇల్లెందు ఏరియాలో ఈపీ ఆపరేటర్ యాదుబనేశ్ కుమార్, కొత్తగూడెం ఏరియాలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ కోలాహలం నర్సింహరాజు, ఎస్టీపీసీలో జూనియర్ అసిస్టెంట్ దూట రాజమల్లును ఎంపిక చేశారు. కాగా, సెక్యూరిటీ విభాగం, వైద్య సిబ్బంది, మైనింగ్ ఉద్యోగులను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.